4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 17 ఏప్రిల్ 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

హార్వర్డ్‌పై ట్రంప్ ఉక్కుపాదం

ఏ దేశంలోనైనా విశ్వవిద్యాలయాలు రాజకీయ దిక్సూచిలా పనిచేస్తాయి. విద్యార్థుల ఆందోళనలు రాజకీయ గతిని మార్చిన సందర్భాలూ చరిత్రలో మనకు కోకొల్లలుగా కనిపిస్తాయి. ప్రపంచ చరిత్రనే మార్చిన రష్యన్ విప్లవమైనా, అమెరికాలో వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమమైనా విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రమేయం లేకుండా జరగలేదనేది కాదనలేని వాస్తవం. అంతెందుకు తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమమైనా విశ్వవిద్యాలయాల నుంచి బలాన్ని, స్ఫూర్తిని పొందినవే. మొన్నకు మొన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు కంచ అడవికి అండగా జరిపిన పోరాటం ఇంకా మన మనసుల్లో తాజాగా ఉన్నది. ఆలోచనల్లో వైవిధ్యం, ఆచరణలో చురుకుదనం విద్యార్థి ఉద్యమాల ప్రత్యేకతగా ఉంటుంది. ఆ కారణంగానే విశ్వవిద్యాలయాల గొంతు నొక్కివేయాలని నిరంకుశ ప్రభుత్వాలు తరచూ కత్తులు దూస్తూ ఉంటాయి. ఓయూ, హెచ్‌సీయూల్లో అమలవుతున్న నిర్బంధం తెలిసిందే. అయితే ఈ విషయంలో అగ్రరాజ్యం అమెరికా ఏ మాత్రం తక్కువ తినలేదు. ఇంకా చెప్పాలంటే రెండాకులు ఎక్కువే చదివింది. అమెరికాలో సర్కారు వర్సెస్ విశ్వవిద్యాలయాల తగాదా ముదిరి పాకాన పడుతుండటమే ఇందుకు తార్కాణం.

హార్వర్డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీలపై ట్రంప్ సర్కారు వేధింపులకు పాల్పడుతుండటం ప్రజాస్వామ్యానికి పెద్ద దిక్కుగా చెప్పుకొనే అమెరికా అసలు రంగు బయటపెడు తున్నది. ఇంతకూ ట్రంప్ సర్కార్ ఏం చెప్తున్నది? క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనలకు అడ్డుకట్ట వేయాలంటున్నది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వ విధానాల పట్ల విధేయత ముఖ్యమంటున్నది. దీన్ని కాదంటే కేంద్రం విడుదల చేసే నిధులు నిలిపివేస్తామంటున్నది. అకడమిక్ స్వేచ్ఛకు సంకెళ్లు వేసే ఫెడరల్ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవని హార్వర్డ్ ఉక్కు సంకల్పంతో ధిక్కరించి, ప్రతిఘటిస్తున్నది. అందుకు ప్రతిఫలం అనుభవిస్తున్నది. ట్రంప్ సర్కారు అన్నంత పనిచేసింది. 2.2 బిలియన్ డాలర్ల నిధులను నిలిపివేసింది. అంతటితో ఊరుకోకుండా ట్రంప్ ఒకడుగు ముందుకువేసి 'ఉగ్రవాద ప్రేరేపిత/ ప్రభావిత జాడ్యాన్ని పెంచి పోషిస్తున్నందుకు' పన్ను మినహాయింపును ఉపసంహరించుకుంటామని బెదిరిస్తున్నారు. అంతే కాకుండా విశ్వవిద్యాలయాన్ని రాజకీయ సంస్థగా గుర్తించి పన్ను వేస్తాననీ తాఖీదు ఇచ్చారు. అయినా హార్వర్డ్ తలవంచలేదు. ప్రభుత్వ నియంత్రణలకు తలొగ్గి, క్యాంపస్‌లను కేంద్ర బలగాలకు అప్పగించేందుకు సిద్ధం కాలేదు. విద్యార్థుల ప్రదర్శనలపై నిషేధం విధించేందుకు, ప్రవేశ, ఉపాధి నిబంధనల సవరణకు అంగీకరించలేదు. వైవిధ్యం, సమానత్వం, సకలజనుల భాగస్వామ్య సూత్రానికి తిలోదకాలిచ్చేందుకు ససేమిరా అంటున్నది. 'విశ్వవిద్యాలయం తన స్వాతంత్ర్యాన్ని పరాధీనం చేయదు. తన రాజ్యాంగ హక్కులను వదులుకోదు' అని హార్వర్డ్ అధ్యక్షుడు అలన్ గార్బర్ ఓ బహిరంగ లేఖలో పేర్కొనడం గమనార్హం. అయితే, అన్ని విశ్వవిద్యాలయాలు ఇలా ప్రతిఘటనా మార్గంలో వెళ్లడం లేదు. కొలంబియా వంటి విశ్వవిద్యాలయాలు ట్రంప్ సర్కారు తాఖీదులకు తలొగ్గి విమర్శల పాలవుతున్నాయి. హార్వర్డ్‌కు 54 బిలియన్ డాలర్ల విరాళం ఉండటం, ఇతర విశ్వవిద్యాలయాలకు ఆ స్థాయిలో సొంత నిధులు లేకపోవడమే ఇందుకు కారణమనే వాదన కూడా ఈ సందర్భంగా వినిపిస్తున్నది.

ఇది మామూలు విషయం కాదు. అమెరికాలోనే అతిపురాతనమైన, పేరెన్నికగన్న విశ్వవిద్యాలయం విషయంలో జరుగుతున్న ఈ దాడి సుదీర్ఘ పర్యవసానాలు కలిగి ఉంటుందని చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే ఇది ప్రభుత్వానికీ, విశ్వవిద్యాలయాలకు మధ్యన ఉండే మర్యాదపూర్వకమైన సంబంధాల నిర్వచనాన్నే మార్చివేస్తున్నది. పరిశోధన, ఉపాధికల్పన అవకాశాలపైనా ప్రభావం చూపుతుంది. అంతిమంగా ప్రభుత్వాలను ప్రశ్నించే స్వేచ్ఛకే ఇది ప్రమాదకరంగా మారుతుంది. విశ్వవిద్యాలయాలు ఒకేరకం సరుకులను తయారుచేసే కర్మాగారాలు కాదు, నూతన భావాలు వికసించే విద్యావిహారాలు. అలాంటి చోట ఆలోచనకు సంకెళ్లు వేయాలనుకోవడం అత్యాశే కాదు, అవివేకం కూడా.

చేతిల సంచి, జబ్బకు గొంగడి..

గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

ఈ నెల 27న భారత రాష్ట్ర సమితి భారీ బహిరంగ సభ జరుపుకోబోతున్న నిర్ణయం వెలువడిన నాటినుంచి కనులు మూసినా, తెరిచినా అదే విషయం కార్యకర్తల మనసులో తారట్లాడుతున్నది. మళ్లీ ఉద్యమం నాటి ఉద్వేగం పెల్లుబుకుతున్నది. నాలో దాదాపు రెండు నెలల కింద కేసీఆర్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశం అందించిన స్ఫూర్తి ఇంకా రగులుతూనే ఉన్నది.

ఫిబ్రవరి 19న కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశానికి వెళ్లే అవకాశం లభించడం నా అదృష్టం. ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రావడంతో కార్యకర్తలు దిగ్భ్రాంతి చెందారు. కాంగ్రెస్, మీడియా దుష్ప్రచారం మొదలుకొని ప్రతికూల ఫలితాలకు అనేక కారణాలు తోడ్పడ్డాయి. కానీ, అది అనూహ్యమైనది. నాక్కూడా ఇప్పటికీ జీర్ణించుకోలేని విషయమది. కేసీఆర్‌ను కలుసుకోవాలని పదే పదే గుండె తన్లాడేది. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంతో ఆ కోరిక నెరవేరడమే కాదు, నాకు మరోసారి 'దట్ ఈజ్ కేసీఆర్' అనిపించింది.

> నాయకుడనేవాడు ఎలా ఉండాలనేది తెలుసుకోవాలనుకుంటే, కేసీఆర్‌ను చూడాలి. అదే కేసీఆర్, అదే ధీమా, అదే చిత్తశుద్ధి, తెలంగాణ పట్ల అదే ఆర్తి. తాను చెప్పడం కాదు, వచ్చినవారు ఏం చెప్తారో వినడం కేసీఆర్‌కు అలవాటు అనేది ఉద్యమకాలం నుంచి గమనిస్తున్నాను.

ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర పెద్ద నాయకులు ఎవరూ మాట్లాడలేదు. జిల్లా, మండలస్థాయి నాయకులకు మాట్లాడటానికి అవకాశం ఇచ్చారు. దాదాపు 5 గంటల పాటు కార్యకర్తల మాటలను ఓపికగా విన్నారు. కొందరు కాంగ్రెస్‌ను విమర్శించబోతే వారించారు. కార్యకర్తలు చెప్పేవన్నీ ఓపికగా వింటూ ఆ అంశాలను రాసుకున్నారు. ఆలోచనలను రాసుకోవడంలో, అమలుచేయడంలో కేసీఆర్ ఎంతో పద్ధతి, క్రమశిక్షణ పాటిస్తారనేది తెలిసిందే. ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

సమావేశానికి ముందు కేసీఆర్ మాట్లాడారు. బయట ప్రచారమైనట్టు కేసీఆర్ కాంగ్రెస్‌ను కానీ, మరే పార్టీని కానీ ఒక్క మాట కూడా అనలేదు. దాదాపు గంట సేపు సాగిన ఆయన ప్రసంగంలో పరోక్షంగా కూడా ఇతర పార్టీలను ప్రస్తావించలేదు. తాము తెలంగాణ కోసం 15 ఏండ్లు పోరాడామని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ పోరాటాన్ని చాలామంది టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి లెక్కకడతారు. కానీ, కేసీఆర్ తాను మేధావులతో చర్చలు జరిపినకాలం నుంచి లెక్కిస్తారు. అందుకే పదిహేనేండ్లు పోరాటం చేశామన్నారు. ఎన్నికల ప్రతికూల ఫలితాల నేపథ్యంలో కేసీఆర్ స్వల్పంగానైనా కుంగుబాటు కనిపించలేదు. మానసికంగా, శారీరకంగా బలహీనంగా కనిపించలేదు.

మనం తెలంగాణ కోసం ఏం చేయాలనేదే కేసీఆర్ ప్రసంగంలో ప్రధానాంశం. ఉద్యమకాలంలోనూ కేసీఆర్ తెలంగాణ ఏర్పాటు ఖాయమని బలంగా నమ్మేవారు, చెప్పేవారు. తెలంగాణ వనరులేమిటి, అవసరాలేమిటి, ఏ విధంగా వృద్ధి చెందాలనేది ఆలోచించేవారు. తెలంగాణ ఏర్పడినంక తొలి ఎన్నికల సందర్భంగా కూడా అదే ఆలోచన. పోలింగ్ ముగిసిన రోజే సాయంత్రం విద్యుత్తు రంగ నిపుణులతో సమావేశమయ్యారు. ఇంకా ఫలితాలు రానేలేదు. అయినా, మన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏయే రంగానికి సంబంధించి ఏమేమి చేయాలనే కార్యక్రమాలు మొదలుపెట్టారు. అప్పటివరకు ఆంధ్రా పాలన సాగినా రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై ఆయనకు పూర్తి అంచనా ఉన్నది. అదే విధంగా ఈ సమావేశంలో కూడా ఈ సారి తాము అధికారానికి రావడం ఖాయమనే ధీమా ఆయనలో వ్యక్తమైంది. తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయాలనే విషయమై ఆయన కసరత్తు చేస్తున్నారు. మళ్లీ దాపురించిన ఈ పరాయి పాలనలో తెలంగాణ ఆగమాగమవుతుందని ఆయనకు తెలుసు. అయినా, ఆ విషయం చెప్పకుండా తాము ఏమి చేయాలనేదే ఆయన ఆలోచించడం నాకే కాదు, ఇతర కార్యకర్తలకు కూడా ఆశ్చర్యం కలిగించింది. ఆయన దృష్టంతా అధికారం కాదు, ఆ తర్వాత తెలంగాణ అభివృద్ధిపైనే ఉన్నది. తెలంగాణ కోసం ప్రజలు ఎంతగా ఉద్యమించారో ఆయనకు తెలుసు. అందుకే ఉద్యమ చరిత్రను తగిన రీతిలో నమోదు చేయాలని కూడా ఆయన అన్నారు. మిగతా నాయకులకు, కేసీఆర్‌కు ఉండే తేడా ఏమిటో ఈ సమావేశం చూసిన వారికి మళ్లీ అర్థమవుతుంది. ఆయన సగటు రాజకీయ నాయకుడు కాదు. పాలనాదక్షుడు. అమెరికా మతవేత్త, రాజకీయ నాయకుడు జేఎఫ్ క్లార్క్ అన్నట్టు 'నాయకులు రాబోయే ఎన్నికల గురించి ఆలోచిస్తారు. కానీ పరిపాలనా దక్షులు రాబోయే తరాల గురించి ఆలోచిస్తారు.

> కేసీఆర్ కూడా పాలనా దక్షుడు. ఆయన ఆలోచనలు ఈ ఎన్నికలు, అధికారాల కన్నా, తెలంగాణ భవిష్యత్తు గురించి, రాబోయే తరాల గురించి ఉంటాయి. మళ్లీ అధికారం వచ్చిన తరువాత సాధారణ మార్పులు కాదు. విప్లవాత్మక మార్పులు తేవాలని ఆయన ఆలోచిస్తున్నట్టు కేసీఆర్ ప్రసంగం ద్వారా అర్థమైంది. ఇతర పార్టీలు ఇక్కడ పుట్టినయి కాదు, మన ప్రయోజనాలు వాటి ఎజెండా కాదు. మన ప్రజల గురించి ఆలోచించవలసింది, చేయవలసింది మనమే అనేది ఆయన భావన.

కేసీఆర్ ప్రసంగం విన్న తర్వాత వెయ్యేనుగుల బలం వచ్చినట్టనిపించింది. జీవితానికి సరిపడా ఆత్మవిశ్వాసాన్ని ఆయన కలిగించారు. నిరంతరం మన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలనుకున్నాను. ఇంత గొప్ప నాయకుడి స్థానంలో రేవంత్ రెడ్డి వంటి అల్పుడిని ఎందుకు ఎన్నుకున్నామా అనిపించింది. కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ ఆర్థిక పరిస్థితి తెలియదు. మన వనరులు ఏమిటో తెలియదు. మన అవసరాలు అంతకన్నా తెలియదు. ఎన్నికల్లో గెలవడానికి అడ్డమైన హామీలు చేశారు. తీరా గెలిచిన తరువాత ఆర్థిక పరిస్థితి ఇలా ఉంటుందని తెలువదని బుకాయిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో బడ్జెట్ ఉంటుంది, అప్పులు, ఆస్తులు అన్నీ పారదర్శకంగా ఉంటాయి. అధికారంలో ఉన్నా లేకున్నా కేసీఆర్‌కు తెలంగాణ ఆర్థిక పరిస్థితి మీద అవగాహన సంపూర్ణంగా ఉన్నది. మొదటిసారి గెలిచినప్పుడు కూడా ఆంధ్ర పాలకుల మీద తప్పు వేసి, తప్పించుకోవాలనుకోలేదు. ఉన్న వనరులతో నడిపారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డారు. ప్రజలకు బతుకు మీద నమ్మకం కలిగించారు. బయటి ప్రపంచంలో తెలంగాణ ప్రతిష్ఠను ఆకాశానికి ఎత్తారు. ఆయనకు కాంగ్రెస్ నాయకులకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది. కేసీఆర్ గెలుపు ఓటములు కొత్త కాదు. ఏటికి ఎదురీదడం ఆయనకు అలవాటే. బలమైన లాబీలు కేంద్రంలో అడ్డుపుల్లలు వేసినా సరే, పోరాడి తెలంగాణ సాధించారు. మృత్యువు నోటిలో తల పెట్టడానికి కూడా సిద్ధపడ్డారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారు. ఇంకా కేసీఆర్ ఎన్ని పరీక్షలు ఎదుర్కోలేదు? ఆయన తెలంగాణ కోసం తపిస్తూనే ఉంటారు. పోరాడుతూనే ఉంటారు. ఆయన నుంచి కార్యకర్తలు స్ఫూర్తి పొందాలి.

ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ మళ్లీ ప్రజలను కదిలిస్తున్నారు. ఇందులో హన్మకొండ సమీపంలోని ఎల్కతుర్తి సభ మొదటిది. సభలు తెలంగాణ ఉద్యమవ్యూహంలో భాగం. ప్రజలతో కేసీఆర్ జరిపే సంభాషణ. ఆయన టీవీల ద్వారా, సభల ద్వారా ప్రజలకు సందేశం ఇస్తూ ఉంటారు. కేసీఆర్ ప్రసంగం అంటే చాలు, జాతీయస్థాయిలో కూడా ఏ నాయకుడికీ లేనంత వ్యూయర్‌షిప్ ఉంటుందని టీవీల వారు అంటారు. అందుకే ఎల్కతుర్తి సభ కోసం జనం ఎదురు చూస్తున్నారు. కేసీఆర్ మాటలు వినడానికి తరలిరావాలని సమాయత్తమవుతున్నారు.

అది 2001, ఏప్రిల్ 27న జలదృశ్యంలో జరిగిన కేసీఆర్ సభ ఆనాడు మా జీవితాలనే మలుపుతిప్పింది. మాలో నూతనోత్సాహాన్ని నింపింది. ఆనాటి నుంచి అనేక సభలు... ప్రతి సభ ఉద్యమాన్ని చరిత్రాత్మకమైన మలుపు తిప్పింది. ప్రతి సభలో పాల్గొన్న నాలాంటి వారు ఎందరో కేసీఆర్ మళ్లీ నిర్వహించే ఎల్కతుర్తి సభ కోసం ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ పిలుపునందుకొని మళ్లీ కదులుదాం. తెలంగాణ స్థితిగతులను మార్చుకుందాం.

> 'చేతిల జెండా..
> జబ్బకు గొంగడి..
> జాతర బోదమా...
> తెలంగాణ జాతర బోదమా?'

(వ్యాసకర్త: చైర్మన్ టీ-కేసీఆర్ సెంటర్, తెలంగాణ నాలెడ్జ్ క్రియేషన్ రీసెర్చ్ సెంటర్)

> ప్రజాస్వామ్యంలో బడ్జెట్ ఉంటుంది, అప్పులు, ఆస్తులు అన్నీ పారదర్శకంగా ఉంటాయి. అధికారంలో ఉన్నా లేకున్నా కేసీఆర్‌కు తెలంగాణ ఆర్థిక పరిస్థితి మీద అవగాహన సంపూర్ణంగా ఉన్నది. మొదటిసారి గెలిచినప్పుడు కూడా ఆంధ్రపాలకులమీద తప్పు వేసి, తప్పించుకోవాలనుకోలేదు. ఉన్న వనరులతో నడిపారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డారు. ప్రజలకు బతుకు మీద నమ్మకం కలిగించారు. బయటి ప్రపంచంలో తెలంగాణ ప్రతిష్ఠను ఆకాశానికి ఎత్తారు. ఆయనకు కాంగ్రెస్ నాయకులకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది.

> 'తెలంగాణ గవర్నర్ ఎవరు?' అని ఓ జర్నలిస్ట్‌ను అడిగినా వెంటనే పేరు చెప్పడం కష్టం. ఈ వ్యాసం రాయడానికి ముందు నేను కూడా గవర్నర్ పేరు జిష్ణుదేవ్ వర్మ అని గూగుల్‌లో చూసి తెలుసుకున్నా. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికారపక్షం, ప్రతిపక్ష నాయకుల పేర్ల కన్నా గవర్నర్ తమిళిసై పేరు, ప్రతిపక్ష నాయకురాలిగా ఆమె ప్రభుత్వంపై చేసే విమర్శలకు మీడియాలో బాగా ప్రచారం లభించేది.

ఈ బంధం దృఢమైనది!

బుద్ధా మురళి

ఐటీ ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చిన దాసోజు శ్రవణ్‌కు మార్ పేరును గవర్నర్ కోటా కింద బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేస్తే గవర్నర్ తమిళిసై శ్రవణ్‌లో రాజకీయ నాయకుడు కనిపించారు. సిఫారసును గవర్నర్ ఆమోదించలేదు. అదే ఖాళీలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోదండరాం రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేస్తే గవర్నర్ ఆమోదించారు. కోదండరాం ఒక రాజకీయ పార్టీ ఏర్పాటుచేసి దానికి అధ్యక్షుడిగా ఉన్నారు. కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేశారు. అయినా కోదండరాంలో రాజకీయ నాయకుడు కనిపించలేదు. బీజేపీకి నచ్చిన పార్టీ అధికారంలో ఉంటే గవర్నర్‌ల వ్యవహారం ఒక రకంగా ఉంటుంది. నచ్చకపోతే ఇంకో రకంగా ఉంటుంది. అందుకు గవర్నర్‌గా తమిళిసై వ్యవహార శైలియే ప్రధాన కారణం.

నిజానికి బీజేపీ రాజకీయాల ప్రకారం రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికన్నా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రభుత్వాన్ని గవర్నర్ ఎక్కువ ఇబ్బంది పెడతారనుకుంటాం. కానీ, బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ నిర్ణయాలకు గవర్నర్ అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గవర్నర్ పేరు జర్నలిస్ట్‌లకు సైతం గుర్తులేనంత సాఫీగా సాగిపోతున్నది. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల అనుబంధానికి ఇదో ఉదాహరణ. రాజకీయపక్షాల మధ్య ఒప్పందాలు, స్నేహాలు లిఖిత పూర్వకంగా ఉండవు. తమ తమ పార్టీల ప్రయోజనాల మేరకు పార్టీల మధ్య ఇలా అనుబంధాలు పెనవేసుకుంటాయి.

తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలకు ఉమ్మడి శత్రువు బీఆర్ఎస్. దీని వల్ల అనివార్యంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య అనుబంధం ఏర్పడుతున్నది. ఒక వేళ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తాము ఉద్యతంగా ఉద్యమించినా ఇప్పటికిప్పుడు మేం అధికారంలోకి రాం, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మా ఉద్యమం వల్ల బీఆర్ఎస్‌కే లాభమనే భావన బీజేపీలో ఉండటం సహజం. పైకి ప్రకటించకపోయినా బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటిలో ఒక పార్టీ కోరుకోమంటే కాంగ్రెస్ అధికారంలోకి రావడమే మేలని బీజేపీ కోరుకుంటుంది. కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ బలహీనపడుతుంది, అప్పుడు ఆ స్థానాన్ని తాము తీసుకోవచ్చనే ఆలోచనలో బీజేపీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతుంది. అందుకే, రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలు ఎన్ని ఉన్నా బీజేపీ మాత్రం ఇంకా బీఆర్ఎస్‌నే విమర్శిస్తున్నది. 'కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో అడవులను నాశనం చేస్తున్నది' అని హెచ్‌సీయూ వ్యవహారంలో ప్రధాని విమర్శిస్తే తెలంగాణలో మాత్రం ఏ ఒక్క బీజేపీ నాయకుడు నోరు మెదపలేదు. అంటే, దేశవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ బద్ధ శత్రువులైనా ఈ రెండు పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఒకరి పట్ల ఒకరు సానుకూల ధోరణితో ఉన్నారనేది సుస్పష్టం.

> 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదం ఇచ్చిన పార్టీ బీజేపీ. దేశవ్యాప్తంగా ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు చెప్పుకుంటున్న పార్టీ కాంగ్రెస్. దేశవ్యాప్తంగా ఈ రెండు పార్టీలు పరస్పరం ఆగర్భ శత్రువుగా భావిస్తాయి. కానీ, తెలంగాణలో మాత్రం వీటికి విడదీయరాని అనుబంధం ఉన్నది.

రాజకీయ పార్టీలు తమ ప్రయోజనం కోసమే పనిచేస్తాయి. ఏ రాజకీయ పార్టీ కూడా మరో పార్టీ ప్రయోజనం కోసం పని చేయదు. బీజేపీ తమ రాజకీయ ప్రయోజనం కోసమే కాంగ్రెస్ పట్ల అనుకూల వైఖరితో ఉంటున్నది. అదేవిధంగా కాంగ్రెస్ సైతం తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ పట్ల సానుకూల వైఖరితో ఉంటున్నది. ఈ రెండు జాతీయ పార్టీల ఉమ్మడి శత్రువు బీఆర్ఎస్.

ఈ మధ్య కేంద్రమంత్రి బండి సంజయ్ ఓ సమావేశంలో మాట్లాడుతూ 'కాంగ్రెస్‌కు క్యాడర్ ఎక్కడుంది? బీఆర్ఎస్‌పై మనం పోరాడితే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడు' అని ప్రకటించారు. ఇందులో కొంత నిజం ఉన్నది. చివరికి బండి సంజయ్ స్వయంగా రంగంలోకి దిగి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదవ తరగతి ప్రశ్న పత్రాన్ని లీక్ చేయించి ఉద్యమించారు. విచారణలో బండి సంజయ్ సెల్‌ఫోన్‌ను పోలీసులు అడిగితే పోయిందని చెప్పారు. ప్రభుత్వంపై పోరాడేందుకు విద్యార్థుల భవిష్యత్తును సైతం నాశనం చేసేందుకు పేపర్ లీక్ చేయించిన బండి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయినా మౌనంగా ఉన్నారంటే బీజేపీ, కాంగ్రెస్ మైత్రిని అర్థం చేసుకోవచ్చు.

హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టి, రాత్రికి రాత్రి వంద ఎకరాల్లో చెట్లను నరికితే వన్యప్రాణులు మరణించడంపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జైలుకు పంపుతామని హెచ్చరించింది. ఇది మాట వరుసకు హెచ్చరిక కాదు, చెట్లు కూల్చిన వంద ఎకరాల్లో తిరిగి మొక్కలు నాటడం గురించి ప్రశ్నించి, లేకపోతే అక్కడే జైలు నిర్మించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జైలుకు పంపుతామని తాజాగా బుధవారం సుప్రీం కోర్టు హెచ్చరించింది. సుప్రీం కోర్టు సైతం సీరియస్‌గా తీసుకున్న ఈ అంశాన్ని బీజేపీ మాత్రం పట్టించుకోవడం లేదు. పైగా బీజేపీ నాయకులు ఇంకా బీఆర్ఎస్ పార్టీనే రాష్ట్రంలో అధికారంలో ఉందని భావిస్తూ... హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో సైతం బీఆర్ఎస్‌నే విమర్శిస్తున్నారు. ఈ భూముల వ్యవహారంలో బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా, ప్రభుత్వానికి అనుకూలంగా వాదిస్తున్నారు.

తమిళనాడులో బిల్లులు ఆమోదించకుండా ప్రభుత్వాన్ని గవర్నర్ ముప్పుతిప్పలు పెడితే చివరికి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఒక్క తమిళనాడులోనే కాదు, కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఢిల్లీలో సైతం ఇదే పరిస్థితి. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్రాల్లో గవర్నర్‌లతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నాయి. కానీ, తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్న పరిస్థితులున్నాయి. అంటే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల బంధం ఎంత దృఢంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ■

దళితులపై ఇంత చిన్నచూపు ఎందుకు?

నరేష్ పాపట్ల
95054 75431

వేల ఏండ్ల 'వెలి'వాడల కన్నీళ్లను తుడిచేందుకు కాంగ్రెస్ పాలకులకు ఇంకా చేతులు రావడం లేదు. నిజాయితీ, శ్రమనే నమ్ముకొని, రెక్కలనే ఆయుధంగా మలచుకొని అట్టడుగు స్థాయుల్లో బతుకీడుస్తున్న దళితులను 'చేవెళ్ల డిక్లరేషన్' పేరుతో మరోమారు దగా చేసినట్టే అనిపిస్తున్నది. ఇందిరమ్మ రాజ్యం, రాజ్యాంగ పరిరక్షణ పేర్లతో ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన 'హస్తం' పాలకులను.. ఇప్పుడు చేవెళ్ల డిక్లరేషన్ హామీల అమలు కోసం నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది.

రాష్ట్ర జనాభాలో దళితులు సింహభాగంగా ఉన్నారు. 2023, ఆగస్టు 26న చేవెళ్లలో జరిగిన ప్రజాగర్జన బహిరంగ సభలో స్వయంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే 'ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్'ను అత్యంత ఆర్భాటంగా ప్రకటించారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకున్నది. ఇందులో దళితుల పాత్ర కీలకమైంది. అయితే, దళితుల సంక్షేమం అంశంలో 'ప్రజా పాలన' అంటూ చెప్పుకొంటున్న పాలకుల శైలి 'ఏరు దాటేదాకా ఓడ మల్లన్న.. ఏరు దాటినాక బోడమల్లన్న' అన్న చందంగా ఉన్నది. 'ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్' సమగ్ర అమలుపై దృష్టి కేంద్రీకరించకపోవడమే ఇందుకు ఉదాహరణ. ఎస్సీలకు ఇచ్చిన హామీల్లో 'ఎస్సీ వర్గీకరణ' అంశమే కార్యరూపం దాల్చింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి, తొలి సీఎం కేసీఆర్ స్వయంగా సంబంధిత తీర్మానం కాపీని ప్రధాని మోదీకి అందజేశారు. ఇక రాజకీయ పార్టీలన్నీ ఆదినుంచి ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణంగా మద్దతు తెలుపుతూ వచ్చాయి. ఒక పక్క సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మక తీర్పు. మరోపక్క తెలంగాణలో దళితుల జనాభాలో మాదిగల సంఖ్య అత్యధికంగా ఉండటంతో ఎస్సీ ఉప వర్గీకరణ అమలుకు అనివార్యత ఏర్పడింది. ఏ ప్రభుత్వం ఉన్నా, రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చేయాల్సి వచ్చేది. తాను సీఎంగా లేకుంటే వర్గీకరణ అసలు జరిగేదే కాదన్నట్టుగా ఎనుముల రేవంత్ రెడ్డి పదే పదే గొప్పలకు పోవడం హాస్యాస్పదం. వర్గీకరణ చట్టం చేయకుండానే ఇటీవల హడావుడిగా గ్రూప్-1, 2, 3తో పాటు ఇతర శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టడం వల్ల మాదిగ, ఉప కులాలకు నష్టం జరిగిన మాట వాస్తవం కాదా? దీనికి ప్రభుత్వ పెద్దలే సమాధానం చెప్పాలి.

ఇక, డిక్లరేషన్‌లో పేర్కొన్న ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ల పెంపు, ఇంటి స్థలంతో పాటు భవన నిర్మాణానికి రూ.6 లక్షల సహకారం అందిస్తామన్న హామీ కాగితాలకే పరిమితమైంది. మాదిగ, మాల, ఉప